సాక్షి తిరుపతి

సోమవారం। 11। సెప్టెంబర్। 2023



సాహితీ సృజనాత్ముడు గౌరిపెద్ది

తిరుపతి అన్నమాచార్య కళామందిరంలో ఆదివారం రాత్రి గౌరిపెద్ది రామసుబ్బశర్మ జయంతి సభ నిర్వహించారు. - IIలో



అంతరిస్తున్న అడవికోళ్లు

ఎస్వీ జూపార్క్‌లోని అడవి కోళ్ల పునరుత్పత్తి కేంద్రం లక్ష్యానికి దూరమై నిరుపయోగంగా మారుతోంది. - IIలో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	34	26
చిత్తూరు	33	25
తిరుమల	29	22
గూడూరు	36	28
నగరి	34	26

న్యూస్‌రీల్

ముక్కంటి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



అలయ ధ్వజస్తంభం వద్ద జస్టిస్ దుప్పాల వెంకటరమణ

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి వారిని ఆదివారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పాల వెంకటరమణ కుటుంబ సమేతంగా సేవించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద అధికారులు వారికి సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి కోర్టు న్యాయమూర్తులు బేబీ రాణి, కృష్ణప్రియ పాల్గొన్నారు.

టీటీడీ బోర్డు సభ్యుడిగా కృష్ణమూర్తి వైద్యనాథన్ ప్రమాణ స్వీకారం



కృష్ణమూర్తి వైద్యనాథన్‌కు శ్రీవారి చిత్రపటం అందిస్తున్న జేఈఓ వీరబ్రహ్మం

తిరుమల : టీటీడీ బోర్డు సభ్యుడి సభ్యుడిగా కృష్ణమూర్తి వైద్యనాథన్ ఆదివారం తిరుమల శ్రీవారి ఆలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. స్వామివారి దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అనంతరం శ్రీవారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. డిప్యూటీ ఈఓ లోకనాథం పాల్గొన్నారు.

వంద గొడ్లను తిన్న రాబందు ఒక్క గాలివానకు పోయినట్టు.. దశాబ్దాల అవినీతి చరిత్రకు ఒక్క కేసు చెక్ పెట్టింది. వ్యవస్థలను మేనేజ్ చేస్తూ.. తనను మించిన వారు లేరని విర్రవీగుతున్న నలభై ఏళ్ల ఇండస్ట్రీకి ఒక్క తీర్పు చుక్కలు చూపెట్టింది. రెండు రోజుల ఉత్కంఠకు తెరదించుతూ టీడీపీ అధినేత చంద్రబాబుకు ఏసీబీ కోర్టు రిమాండ్ విధించింది. దీంతో తమ్ముళ్లలో నైరాశ్యం అలుముకుంది. చివరకు ప్రజల నుంచి కూడా స్పందన రాకపోవడంతో దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు యంత్రాంగం అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించింది. తెలుగుదేశం నేతలు రెచ్చగొట్టినా సంయమనం పాటిస్తూ శాంతిభద్రతలను పరిరక్షించింది. – సాక్షి, తిరుపతి



జైలుకు బైస్కిల్!

- స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో చంద్రబాబుకు రిమాండ్
- ఎక్కడికక్కడ అడ్డుకున్న పోలీసు యంత్రాంగం
- అల్లర్లు సృష్టించేందుకు తమ్ముళ్ల యత్నం
- శ్రీకాళహస్తిలో టీడీపీ నేతల గూండాగిరి

న్యాయం గెలిచింది



చంద్రబాబు ఎన్ని కుయుక్తులు పన్నినా, చివరకు న్యాయమే గెలిచింది. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు అడ్డంగా దొరికి జైలుపాలయ్యాడు. ఇన్నాళ్లూ స్టేలు తెచ్చుకుని తప్పించుకుని తిరుగుతున్నారు. అయితే సీఐడీ అధికారులు స్కిల్ డెవలప్‌మెంట్ వ్యవహారంలో చంద్రబాబు రూ.371కోట్లు అవినీతికి పాల్పడినట్లు పక్కా సాక్ష్యాధారాలు సేకరించి కోర్టుకు సమర్పించారు. కోర్టు ఆధారాలను చూసి ఆయనకు 14 రోజులు జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. అయితే బాబు దత్తపుత్రుడు అవినీతి, అక్రమాలకు పాల్పడిన చంద్రబాబును వెనుకేసుకొస్తూ హంగామా చేస్తుండటం విడ్డూరంగా ఉంది. – బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్యే, శ్రీకాళహస్తి

పాపం పండింది



కర్మ ఫలితం అనుభవించాల్సిందే. ఇన్నాళ్లకు చంద్రబాబు పాపం పండింది. ఎన్‌టీఆర్‌ను మానసిక క్షోభకు గురిచేసినందుకు దేవుడే శిక్ష విధించాడు. స్కిల్ స్కామ్‌లో రూ.371కోట్ల అవినీతికి పాల్పడినట్లు పక్కాగా ఆధారాలతో సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. అవినీతి సొమ్మును విదేశాలకు తరలించి వివిధ మార్గాల్లో మళ్లీ చంద్రబాబే తెచ్చేసుకున్నట్లు ఆధారాలు సేకరించారు. ఏసీబీ కోర్టు నిష్పక్షపాతంగా తీర్పు వెలువరించడం హర్షణీయం. రిమాండ్‌లో ఇంకా కొత్త విషయాలు బయటకు వస్తాయి. ఇక లోకేష్ కూడా జైలుకెళ్లడం ఖాయం. – బల్లి కల్యాణచక్రవర్తి, ఎమ్మెల్సీ

తప్పు చేస్తే ఎవరూ తప్పించుకోలేరు



తప్పుచేస్తే ఎంతటివారైనా చట్టం నుంచి తప్పించుకోలేరు. స్కిల్ స్కాం కేసులో నాలుగేళ్ల పాటు సుదీర్ఘ విచారణ జరిగింది. సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఎలాంటి కక్షతో రాజకీయం చేయలేదు. ఎవరి ప్రమేయం లేకుండా చట్టం తనపని తాను చేసుకుపోతుందని గట్టిగా నమ్మారు. ఈ స్కాంలో ప్రధాన సూత్రధారి చంద్రబాబే అని సీఐడీ అధికారులు ఆధారాలతో సహా కోర్టుకు సమర్పించారు. నిష్పక్షపాతంగా విచారణ చేపట్టిన చంద్రబాబును దోషిగా తేల్చారు. వ్యవస్థలను అడ్డంపెట్టుకుని రాజకీయాలు చేసిన చంద్రబాబు అప్రజాస్వామికుడు. ఇలాంటి వ్యక్తి రాజకీయాల్లో ఉండేందుకు అనర్హుడు. – వెలగపల్లి వరప్రసాద్‌రావు, ఎమ్మెల్యే, గూడూరు

ధర్మమే గెలిచింది



స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో ధర్మమే గెలిచింది. అవినీతికి పాల్పడిన చంద్రబాబుకు రిమాండ్ విధించి ఏసీబీ కోర్టు తగిన తీర్పు ఇచ్చింది. తప్పు చేసిన వారికి శిక్ష తప్పదని మరోసారి రుజువైంది. దీనిపై ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అభినందనలు తెలుపుతున్నారు. – కోనేటి ఆదిమూలం, ఎమ్మెల్యే , సత్యవేడు

తగిన శాస్తి జరిగింది



తప్పు చేసిన చంద్రబాబుకు తగిన శాస్తి జరిగింది. దేశంలోనే అత్యంత అవినీతిపరుడు చంద్రబాబు. అక్రమ మార్గాల్లోనే ఆయన 2 ఎకరాల నుంచి రూ.వేల కోట్లకు ఎదిగాడు. స్కిల్ స్కామ్ కేసులో అవినీతికి పాల్పడినట్లు కోర్టు నమ్మింది కాబట్టే రిమాండ్ విధించింది. ఇప్పటికి ఎన్‌టీఆర్ ఆత్మకు శాంతి లభించింది. ఇంతకాలం వ్యవస్థలను మేనేజ్ చేసిన చంద్రబాబు బాగోతాలు ఇకపై ఒక్కొక్కటిగా బయటకు వస్తాయి. – మేరిగ మురళీధర్ , ఎమ్మెల్సీ

ఇన్నాళ్లకు చిక్కారు



ఎప్పటి నుంచో సంస్థలను మేనేజ్ చేస్తూ వచ్చారు. తన తప్పులను కప్పిపుచ్చుకుంటూ జనాన్ని నమ్మించి ఇన్నాళ్లూ కాలరెగరేసుకు తిరిగారు. ఇప్పుడు అసలు రంగు బయటపడింది. అవినీతి అక్రమాలు చేయడంలో చంద్రబాబును మించిన వాళ్లు లేరు. స్కిల్ స్కామ్‌లో చంద్రబాబు అడ్డంగా బుక్కయ్యారు. దీనిని బట్టి చట్టానికి ఎవ్వరూ చుట్టాలు కాదన్న విషయం నిరూపితమైంది. చంద్రబాబు రాజకీయ చరిత్రలో చేసిన అవినీతి అక్రమాలకు వెయ్యేళ్ల జైలు శిక్ష వేసినా సరిపోదు. చంద్రబాబు ఏమి చేసినా తనను టచ్ చేసేవాళ్లు ఎవ్వరూ లేరు రారు అనుకుని ఇన్నేళ్లు విర్రవీగారు. – భూమన కరుణాకరరెడ్డి, ఎమ్మెల్యే, తిరుపతి

చట్టం ముందు అందరూ సమానులే



చట్టంముందు అందరూ సమానులే. చంద్రబాబు చేసిన అవినీతి, అక్రమాల్లో బయటపడింది గోరంతే. ఇంకా తవ్వేకొద్దీ మరిన్ని అక్రమాలు వెలుగుచూసే అవకాశం ఉంది. లోతుగా విచారణ జరిపితే చంద్రబాబుకు జీవిత కాలం శిక్ష పడ్డా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. చట్టం ముందు ఎవ్వరూ తప్పించుకోలేరు. చట్టానికి ఎవ్వరూ చుట్టాలు కాదు అన్న విషయం కూడా నేడు రుజువైంది. – మద్దిల గురుమూర్తి, ఎంపీ, తిరుపతి

వంచన ఫలితమే..



జాబు కావాలంటే.. బాబు రావాలి అనే మోసపూరిత నినాదంతో 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు యువతను దగా చేశారు. ఆ వంచన ఫలితమే బాబు జైలుకెళ్లారు. తప్పు చేసిన వారు చట్టం ముందు తలవంచక తప్పదని స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో ఏసీబీ కోర్టు ఇచ్చిన తీర్పు రుజువైంది. టీడీపీ అధినేత చెప్పే మాటలు వేరు, చేసే పనులు వేరు. ఒకరిని మోసం చేయాలని చూస్తే వారే మోసపోతారనేందుకు ఇదే నిదర్శనం. – డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, ఎమ్మెల్సీ

అల్లర్లకు టీడీపీ నేతల యత్నం

- కట్టడి చేసిన పోలీసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలో టీడీపీ నేతలు అల్లర్లకు యత్నించగా పోలీసులు వారిని కట్టడి చేశారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఇచ్చిన పిలుపు మేరకు అల్లర్లు సృష్టించేందుకు పెద్దసంఖ్యలో టీడీపీ శ్రేణులు ఎన్టీఆర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. అయితే 144 సెక్షన్ అమలులో ఉందని, ఎవ్వరూ గుమికూడరాదని పోలీసులు వారించినా వారు వినిపించుకోలేదు. పోలీసులపైకి దూసుకెళుతూ దాడికి దిగేందుకు ప్రయత్నించారు. పోలీసులు సంయమనం పాటించి వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేసినా వినిపించుకోలేదు. దీంతో వారందరినీ పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

పోలీసులపైనే దౌర్జన్యం

శ్రీకాళహస్తిలో టీడీపీ నాయకులు బరితెగించారు. ప్రజలను కాపాడుతున్న రక్షకభటులపైనే దౌర్జన్యానికి తెగబడ్డారు. ఈ ఘటన ఆదివారం శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో చోటుచేసుకుంది. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు రిమాండ్ విధించిన నేపథ్యంలో స్థానిక టీడీపీ నేతలు ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిరసనకు దిగారు. వారిని రెండో పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అక్కడ ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. తమను బయటకు పంపాలని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఒకానొక దశలో పోలీసులపైనే దౌర్జన్యం చేయబోయారు. పోలీస్‌స్టేషన్‌లోని ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు.



పోలీసులతో టీడీపీ నేతల తోపులాట

ఎస్వీ అలెర్జీ అండ్ చెస్ట్ హాస్పిటల్ ప్రారంభం



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

తిరుపతి తుడా: తిరుపతిలోని డాక్టర్ వైఎస్సార్ మార్గ్ (డీబీఆర్ రోడ్డు) శ్రీనివాస సముదాయం వెనుక నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్వీ అలెర్జీ అండ్ చెస్ట్ హాస్పిటల్‌ను ఆదివారం ప్రారంభించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆస్పత్రిని, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఐసీయూను ప్రారంభించారు. ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, నగర మేయర్ డాక్టర్ శిరీష, డీఎంహెచ్ఓ శ్రీహరి, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పోకల అశోక్ కుమార్ వివిధ విభాగాలను ప్రారంభించారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ డాక్టర్ సుబ్బారావు, కోవిడ్ సమయంలో చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఎమ్మెల్యే భూమన మాట్లాడుతూ గత 20 ఏళ్లుగామెరుగైన ఫల్మనాలజీ వైద్య సేవలు అందిస్తున్న సుబ్బారావు ఆస్పత్రి ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. డాక్టర్ సుబ్బారావు దంపతులు ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్, రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభు, మెటర్నిటీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పార్థసారథి రెడ్డి, ఈఎస్ఐ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

పిచ్చాటూరు : మండలంలోని గోవర్ధనగిరి ఎస్టీ కాలనీకి చెందిన శ్రీనివాసులు ఇంట్లో ఆదివారం సాయంత్రం ఓ ఇంట్లో గ్యాస్ సిలిండ్ పేలింది. వివరాలు.. శ్రీనివాసులు భార్య వెంకటరత్నం వంట చేసేందుకు గ్యాస్ స్టౌ వెలిగించి బయటకు వచ్చింది. ఇంతలో పెద్ద శబ్దంతో గ్యాస్ సిలిండర్ పేలి ఇంట్లో మంటలు ఎగసిపడ్డాయి. ఈ ప్రమాదంలో ఇల్లు పూర్తిగా దగ్ధం కాగా.. లోపల బీరువాలో దాచిన రూ.20వేల నగదు, 1.5 సవర్ల బంగారం కాలి బూడిదగా మారింది. బ్యాంకు రుణం తీసుకున్న నగదు అగ్నికి ఆహుతైందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంట్లోని విద్యుత్ ఉపకరణాలు, దుస్తులు పూర్తిగా కాలిపోయినట్లు వాపోయారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్సీ కందేరి జయచంద్రనాయుడు కోరారు.

సాహితీ సృజనాత్ముడు గౌరిపెద్ది

- టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి



గౌరిపెద్దిపై ప్రచురించిన ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి కల్చరల్: అద్భుతమైన సాహితీ సృజన చేసిన ప్రముఖులలో గౌరిపెద్ది రామసుబ్బ శర్మ ఒకరని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. గౌరి పెద్ది రామసుబ్బ శర్మ 101వ జయంతి సందర్భంగా ఆదివారం రాత్రి అన్నమాచార్య కళామందిరంలో గౌరి పెద్ది జయంతి సభ నిర్వహించారు. దీనికి టీటీడీ చైర్మన్ ముఖ్య అతిథిగా విచ్చేసి గౌరిపెద్ది రామసుబ్బ శర్మపై ప్రచురించిన ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌరిపెద్ది పాండిత్యం గురించి తెలుసుకోవాల్సిన అవసరం నేటి తరానికి ఎంతో ఉందన్నారు. అన్నమాచార్య కళామందిరం, త్యాగరాజ మందిరం తిరుపతిలో గొప్ప సాహితీ వేదికలుగా నిలిచాయన్నారు.
నేటి తరానికి సాహితీవేత్తల గురించి తెలుసుకోవాలన్న తపన లేదని, చెప్పేవారు కూడా లేరని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నేటి కాలంలో సాహిత్య పుస్తకాలు చదివే అలవాటు తగ్గిపోయిందని, ఇది సమాజానికి మంచిది కాదని ఆందోళన వ్యక్తం చేశారు. గతాన్ని ఒక్కసారి తిరగేసి మనసుతో చదివితే పరిపూర్ణులు కాగలిగినంత పాండిత్య శక్తి పూర్వీకులు మనకు ఇచ్చారని తెలిపారు. ఇలాంటి పాండిత్యాన్ని నేటి తరానికి పరిచయం చేసే ప్రయత్నం గతంలో చేశానని, మరోసారి ప్రయత్నం చేస్తానని, ఇది అందరి సహకారంతో జరగాల్సిన పని అని తెలిపారు. స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వీ కుమార్ నవచండీ సంప్రదాయం- వైదికత, పమిడికాల్వ మధుసూధన్ గౌరిపెద్ది వారి సాహిత్య సంవీక్షణం, డాక్టర్ నాగరాజ్యు లక్ష్మి గౌరి పెద్ది వారి పాండిత్యం -అవధాన పద్యసౌరభం అనే అంశాలపై ఉపన్యసించారు. గౌరి పెద్ది కుమారులు శంకర్ భగవాన్ పాల్గొన్నారు. అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మ పాల్గొన్నారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,496

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.73,100
రిటైల్ వెండి గ్రాము	రూ.75.10

కోడి పందేలపై దాడి

చిల్లకూరు (చిట్టమూరు) : చిట్టమూరు మండలం గునపాడు శివారులో ఆదివారం నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ముగ్గురు పందెంరాయుళ్లతోపాటు నాలుగు కోళ్లు, రూ.700 నగదు, ఆరు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎస్వీయూలో ధర్మనిధి ఉపన్యాసం



డాక్టర్ బీవీ రావును సత్కరిస్తున్న ఎస్వీయూ వీసీ రాజారెడ్డి, నిర్వాహకులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ గణాంకశాస్త్ర విభాగంలో పద్మవిభూషణ్ డాక్టర్ సీఆర్.రావు స్థాపించిన సీడీ నాయుడు అండ్ ఆర్కాట్ లక్ష్మీకాంతం ధర్మనిధి ఉపన్యాసాన్ని ఎస్వీయూ వీసీ ఆచార్య కె.రాజారెడ్డి ఆదివారం జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. దీనికి వక్తగా ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్‌లో పని చేసిన డాక్టర్ బీవీ.రావు హాజరయ్యారు. గణాంక శాస్త్రంలో ఉత్తమ ఫలితాలు రాబట్టడానికి కైనటిక్ ఎనర్జీ సిద్ధాంతాన్ని ఉపయోగించే పద్ధతులను వివరించారు. ఈ సమావేశంలో తిరుపతి ఇంటర్నేషనల్ స్టాటిస్టిక్స్ అసోసియేషన్‌ను ప్రారంభించారు. గణాంక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సరోజమ్మ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆచార్య బాలసిద్ధముని, ఆచార్య వెంకట్రామయ్య, డాక్టర్ హరి, మల్లిఖార్జున్‌రెడ్డి, డాక్టర్ వెంకటరమణారెడ్డి, డాక్టర్ మణి, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వర్ణప్రాశన ఔషధంతో జ్ఞాపకశక్తి పెరుగుదల



సమావేశంలో మాట్లాడుతున్న జేఈఓ సదా భార్గవి

తిరుపతి తుడా: స్వర్ణప్రాశన ఔషధంతో పిల్లల్లో జ్ఞాపకశక్తి, రోగనిరోధక శక్తి, మేధస్సు, జీర్ణశక్తి పెరుగుతుందని ఆయుర్వేద గ్రంథాల్లో స్పష్టంగా ఉన్నట్లు జేఈవో సదా భార్గవి అన్నారు. ఎస్వీ ఆయుర్వేద ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఎస్వీ బాలమందిరం విద్యార్థులకు స్వర్ణప్రాశన ఔషధం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జేఈవో మాట్లాడుతూ వేల సంవత్సరాల క్రితమే మన పూర్వీకులు కాశ్యపసంహిత గ్రంథంలో స్వర్ణప్రాశన గురించి తెలియజేశారన్నారు. ఇందులో ఆరు నెలల నుంచి 16 ఏళ్లలోపు పిల్లలు ఈ ఔషధాన్ని తీసుకోవచ్చని చెప్పారు. చిన్నతనం నుంచి ఆయుర్వేద మందులు అలవాటు చేసుకోవాలని చెప్పారు. ఎస్వీ ఆయుర్వేద ఫార్మసీ ఆధ్వర్యంలో త్వరలో 357 ఔషధాలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. స్వర్ణప్రాశన ఔషధం ఉత్పత్తికి సహకరించిన డాబర్ ఇండియా లిమిటెడ్ వారికి జేఈవో కృతజ్ఞతలు తెలిపారు. టీటీడీ పీఆర్‌వో డాక్టర్ టి.రవి మాట్లాడుతూ టీటీడీ విద్యా సంస్థల విద్యార్థులందరికీ ఈ ఔషధాన్ని అందించాలని సూచించారు. టీటీడీ నిర్వహణలో ఉన్న స్విమ్స్, బర్డ్ ఆస్పత్రుల తరహాలతో ఎస్వీ ఆయుర్వేద ఆస్పత్రి అభివృద్ధి చెందుతోందని చెప్పారు. జేఈవో సారథ్యం టీటీడీ విద్య, వైద్య రంగాలకు స్వర్ణ యుగమని వివరించారు. ఈ కార్యక్రమంలో డాబర్ ఇండియా లిమిటెడ్ ప్రతినిధి ముబారక్, ఎస్వీ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మురళీకృష్ణ, ఆయుర్వేద ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రేణుదీక్షిత్, బాల మందిరం ఏఈవో అమ్ములు, వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వెంకటగిరిలో తమ్ముళ్ల ఓవర్ యాక్షన్

వెంకటగిరిరూరల్ : టీడీపీ అధినేత చంద్రబాబుని అరెస్ట్ చేయడంపై ఆ పార్టీ నేతలు ఆదివారం వెంకటగిరిలో ఓవర్ యాక్షన్ చేశారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణం ఎదుట అనుమతి లేకుండా టెంట్ వేసి ప్రజలను ఇబ్బంది పెట్టారు. పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని టెంట్ తొలగించాలని ఆదేశించినా బేఖాతర్ చేశారు. దీంతో ఎస్‌ఐలు నరసింహారావు, వీరనారాయణ, నాగరాజు తమ సిబ్బందితో టీడీపీ నేతలను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. మొత్తం 35 మందిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నెలలో చెరువుల్లోకి చేపపిల్లలు



తొట్టెల్లో పెంచుతున్న చేపపిల్లలు

తిరుపతి అర్బన్ : జిల్లాలోని 572 చెరువుల్లోకి మరో నెలలో చేపపిల్లలను వదలనున్నారు. 20 రోజుల క్రితం జిల్లా మత్స్యశాఖ కార్యాలయం, కల్యాణీడ్యామ్, పిచ్చాటూరు రిజర్వాయర్ వద్ద చేపల కేంద్రానికి 1.30 లక్షల చేపపిల్లలు వచ్చిన విషయం తెలిసిందే. వాటిని జాలర్ల పర్యవేక్షణలో పెంచుతున్నారు. ప్రస్తుతం చెరువుల్లో నీరు చేరడంతో అక్టోబర్ 15వ తేదీ నుంచి చేప పిల్లలను వదిలేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

ఇద్దరు టీడీపీ నేతలకు రిమాండ్



రిమాండ్‌కు వెళ్లిన టీడీపీ నేత

కేవీబీపురం: చంద్రబాబునాయుడు అరెస్టును వ్యతిరేకిస్తూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి, పోలీసుల ఆదేశాలను ధిక్కరించిన కేసులో కేవీబీపురం మండలం, ఆరె గ్రామానికి చెందిన టీడీపీ నేత పేరణి జయరామిరెడ్డి, చైతన్య పై పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులను శ్రీకాళహస్తి కోర్టులో హాజరు పరచగా.. ఇద్దరు నిందితులకు కోర్టు రిమాండ్ విధించింది. ఇదే ఘటనకు సంబంధించి మరో కొంతమంది టీడీపీ నేతలపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. చంద్రబాబు నాయుడుకు కోర్టు రిమాండ్ విధించడంతో పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా టీడీపీ నేతలను గృహ నిర్బంధం చేశారు.

అనుమానాస్పద మృతిపై కేసు



శ్రీనివాసులు మృతదేహం

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని చంద్రబాబు కాలనీకి చెందిన గంగిపంగి శ్రీనివాసులు (23) మృతిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. పట్టణంలోని ఓ ప్రైవేట్ సంస్థలో శ్రీనివాసులు పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం తుమ్మూరు చెరువులో శ్రీనివాసులు పడి ఉండగా స్థానికులు గుర్తించారు. వెంటనే ఆయన కుటుంబీకులకు సమాచారం అందించారు. శ్రీనివాసులును స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో మృతుడి భార్య సుష్మ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా ఎస్‌ఐ కృష్ణయ్య ఆదివారం కేసు నమోదు చేశారు.

వాహనం ఢీకొని జింక మృతి



దొరవారిసత్రం : చెన్నై- నెల్లూరు జాతీయ రహదారిపై బీసీ గురుకుల పాఠశాల వద్ద శనివారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని చుక్కల జింక మృతి చెందింది. ఆదివారం దీనిపై సమాచారం అందుకున్న ఫారెస్ట్ బీట్ అధికారులు శ్రీనివాసులు, బాలకృష్ణ ఘటనాస్థలానికి చేరుకున్నారు. జింక కళేబరాన్ని పోస్టుమార్టం అనంతరం సమీపంలోని అటవీప్రాంతంలో ఖననం చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గూడూరురూరల్ : పట్టణంలోని కర్నాలవీధి బొడ్డుచౌక వద్ద ఆదివారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు వన్‌టౌన్ సీఐ హజరత్ బాబు తెలిపారు. మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు వెల్లడించారు.

అంతరిస్తున్న అడవి కోళ్లు

దేశంలోనే అరుదైనవిగా గుర్తింపు పొందిన అడవి కోడి క్రమేణా కనుమరుగవుతోంది. బూడిదరంగులో కనువిందు చేసే ఈ జాతి ప్రస్తుతం అంతరిస్తున్న జాబితాలో చేరిపోయింది. వీటి పునరుత్పత్తి కోసం తిరుపతి ఎస్వీ జంతుప్రదర్శనశాలలో ప్రత్యేక కేంద్ర ఏర్పాటు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. ఏటా రూ.లక్షలు వెచ్చిస్తున్నా కోళ్ల సంఖ్య ఏమాత్రం పెరగడం లేదు. జూపార్క్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే లక్ష్యం నీరుగారిపోతోందని పక్షి ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా దిద్దుబాటు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

- అరుదైన బూడిదరంగు జాతి కనుమరుగు
- ఎస్వీ జూలో ఐదేళ్లుగా ఆగిన పునరుత్పత్తి
- రూ.లక్షలు వెచ్చిస్తున్నా నెరవేరని లక్ష్యం



ఎస్వీ జూపార్క్‌లోని బూడిదరంగు కోళ్ల పునరుత్పత్తి కేంద్రం

తిరుపతి మంగళం : బూడిదరంగు అడవికోళ్లు (గ్రే జంగిల్ఫోల్)నిజానికి దేశంలోనే కాదు, ప్రపంచంలోనే భూమి మీద మనుగడ సాగిస్తున్న అరుదైన జీవజాతుల్లో ఒకటిగా గుర్తింపు పొందాయి. అయితే అంతరించిపోతున్న జాతుల్లోనూ ఒకటిగా అంతర్జాతీయ సంస్థ సైటీస్ రికార్డుల్లోకి ఎక్కాయి. బూడిదరంగు అడవికోళ్లు ఒకప్పుడు దేశమంతా అడవుల్లో సమృద్ధిగా ఉండేవి. ఇప్పుడు శేషాచలం అటవీప్రాంతం మాత్రమే బూడిదరంగు అడవికోళ్లకు నిలయంగా ఉంది. ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం తిరుపతి శ్రీవేంకటేశ్వర జంతుప్రదర్శనశాలలో బూడిదరంగు అడవికోళ్ల పునరుత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటుచేసింది. ఇక్కడ కోళ్లను పెంచి, దేశవ్యాప్తంగా అడవుల్లో వదిలిపెట్టి వాటిని కాపాడాలని నిర్ణయించింది. అయితే ఆ లక్ష్యం మాత్రం నెరవేరడంలేదు. రూ.లక్షలు ఖర్చుపెట్టి ఏర్పాటు చేసిన పునరుత్పత్తి కేంద్రంలో కోళ్ల సంఖ్య వంద మార్కుకు కూడా చేరుకోలేదు.

నిర్వహణ లోపంతోనే..

అడవికోళ్లను మళ్లీ పెంపుచేయాలని కేంద్ర ప్రభుత్వం గతంలో నిర్ణయం. తీసుకుంది. ఇందుకోసం శేషాచలం అటవీప్రాంతాన్ని ఎంచుకుంది. ఈ నేప థ్యంలోనే సెంట్రల్ జూ అథారిటీ (సీజెడ్) ఆధ్వర్యంలో తిరుపతి ఎస్వీ జూపార్క్‌లో అడవికోళ్ల పునరుత్పత్తి కేంద్రాన్ని 2014 మార్చి 21వ తేదీన ప్రారంభించింది. ఇందుకోసం జూలో అధికారులు ఒక సముదాయాన్ని సైతం నిర్మించారు. ముందు గా 33 ఆడ, మగ అడవి కోళ్లను సేకరించి పునరుత్పత్తికి శ్రీకారం చుట్టారు. కోళ్లు పెట్టిన గుడ్లను పొది గించేందుకు సహజసిద్ధమైన పద్ధతులతోపాటు, ఇంక్యుబేటర్లను కూడా ఉపయోగించారు. అయితే వందల సంఖ్యలో గుడ్లను పొదిగిస్తే పదుల సంఖ్యలో కూడా పిల్లలు బయటకు రాని పరిస్థితి ఏర్పడింది. పుట్టిన పిల్లలు కూడా ఏదో ఒక అనారోగ్య సమస్యతో మృతి చెందేవి. ఈ తొమ్మిదేళ్ల కాలంలో వాటి సంఖ్య పునరుత్పత్తి కేంద్రంలో అడవి కోళ్ల సంఖ్య 50 కూడా మించలేదు. దీనికి గల కారణాల ను అన్వేషించి, కోళ్ల వృద్ధికి చర్యలు చేపట్టాల్సిన అధికారులు కూడా ఆ దిశగా దృష్టి సారించలేదు. పునరుత్పత్తి కేంద్రం నిర్వహణను పట్టించుకోలేదు. 2018 వరకు నిధులను కేటాయిస్తూ వచ్చిన సెంట్రల్ జూ అథారిటీ సైతం తర్వాత ఇవ్వడం మానేసిందని అధికారులు అంటున్నారు. అయితే ఇందుకు జూ నిర్వాహకుల బాధ్యత కూడా ఉందని కొందరు అటవీశాఖ అధికారులు ఆరోపిస్తున్నారు. ఇచ్చిన నిధులతో అభివృద్ధి చేసి చూపిస్తే జూ అథారిటీ నిధులను విడుదల చేస్తూ ఉండేదని వెల్లడిస్తున్నారు. నిర్వహణలోపంతోనే నిధులు కూడా ఆగిపోయాయని వివరిస్తున్నారు.

నిర్లక్ష్యంతోనే..

ఎస్వీ జూపార్క్‌లో 2014 నుంచి 2018వరకు బూడిదరంగు అడవికోళ్ల పునరుత్పత్తి చేపట్టినా అనుకున్న ఫలితాలను రాలేదు. ఇక్కడ కోళ్లు పెడుతున్న గుడ్లు, గుడ్లను పొదిగే కోళ్లు రెండూ సమస్యగానే మారాయి. గుడ్లను కోళ్లు పొదగలేకపోతుండడంతో గతంలో ఇంక్యుబేటర్లను కూడా ఉపయోగించినా ప్రయోజనం లేకుండా పోయింది. జూ బాధ్యతలను నిర్వర్తించే అధికారులు నిర్లక్ష్యంతోనే అడవికోళ్ల పునరుత్పత్తి నిలిచిపోయిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పునరుత్పత్తికి చర్యలు



ఎస్వీ జూలో బూడిదరంగ అడవికోళ్ల పునరుత్పత్తికి నిధుల సమస్య లేదు. సీజెడ్ 2018లో రూ.70లక్షలు మంజూరు చేసింది. అందులో ఇప్పటికీ రూ.20 లక్షలు ఉన్నాయి. కాకపోతే కోళ్ల సంఖ్య పెంపుపై గతంలో ఏం జరిగిదో తెలియదు. ఇప్పుడు మేము దీనిపై ప్రత్యేక దృష్టిసారించాం. బూడిదరంగు కోళ్ల పునరుత్పత్తికి తగు చర్యలు తీసుకుంటున్నాం. ఇందులో భాగంగానే చెన్నైలోని వెటర్నరీ కళాశాలను సంప్రదించాం. వారి సూచనల మేరకు కోళ్లకు ప్రోటీన్ కంటెంట్ ఎక్కువగా ఉండే ఆహారం అందిస్తున్నాం.

- సెల్వం, ఎస్వీ జూపార్క్ క్యూరేటర్, తిరుపతి



ఎస్వీ జూలో పునరుత్పత్తి నిలిచిపోయిన బూడిదరంగు అడవికోళ్లు

క్లుప్తంగా

శాస్త్రోక్తంగా అశ్వపూజ


అశ్వపూజ నిర్వహిస్తున్న జేఈఓ వీరబ్రహ్మం

చంద్రగిరి : శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీనివాస అష్టోత్తర శతకుండాత్మక మహాశాంతి వరుణయాగంలో భాగంగా ఆదివారం శాస్త్రోక్తంగా అశ్వపూజ జరిపించారు. ఉదయం ఉత్సవమూర్తులను యాగశాలలో వేంచేపు చేసి ఋత్వికులు వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం జేఈఓ వీరబ్రహ్మం యాగశాల నుంచి పూజా సామాగ్రితో అశ్వాల వద్దకు చేరుకున్నారు. తదుపరి వేద మంత్రోచ్ఛారణల నడుమ అశ్వపూజ చేశారు. సోమవారం నిర్వహించే మహా పూర్ణాహుతితో యాగం పరిపూర్ణం కానుంది. అనంతరం ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం, చక్రస్నానం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్ పాల్గొన్నారు.

గజ బాధితుడికి ఆర్థిక సాయం


కార్తీక్‌కు సాయం అందిస్తున్న నాయకులు

గుడిపాల: మండలంలో పది రోజుల కింద ఏనుగు దాడిలో గాయపడిన బసవాపల్లె దళితవాడకు చెందిన కార్తీక్(25)కు ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి ఆదివారం రూ.50 వేలు సాయం చేశారు. రాణిపేట సీఎంసీ ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన కార్తీక్‌కు విజయానందరెడ్డి తరఫున వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు,కుప్పిగానిపల్లె సర్పంచ్ మధుసుధన్‌రాయల్, ఎంపీటీసీ సభ్యులు గోళ్లహరిప్రసాద్, చిట్టిబాబు ఈ సాయం చేశారు. ఆస్పత్రి ఖర్చులకు సంబంధించి కూడా సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సాయం చేస్తామని తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

తిరుపతి అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వినతులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా అర్జీలు రాసేందుకు ముగ్గురు వీఆర్‌ఓలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. స్పందనకు అన్నిశాఖల ఉన్నతాధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. అలాగే గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రతి రోజూ సాయంత్రం స్పందన వినతులు స్వీకరించాలని స్పష్టం చేశారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండిపోవడంతో క్యూలైన్ కృష్ణ తేజ అతిథి గృహం వరకు చేరుకుంది. శనివారం అర్ధరాత్రి వరకు 78,557 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 42,083 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ. 3.48 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

క్రీడా మైదానాలకు మెరుగైన వసతులు


మైదానాన్ని పరిశీలిస్తున్న శాప్ అధికారులు

నగరి : క్రీడలకు ఎన్నడూ లేనంత ప్రోత్సాహం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో లభిస్తోంది. నగరిలోని శాప్ కేవీకే మైదానానికి ఇప్పటికే ఎన్నో వసతులు వచ్చాయి. క్రికెట్ నెట్‌ప్రాక్టీస్, క్రికెట్, బాస్కెట్ బాల్, బ్యాడ్మింటన్, బాల్‌బ్యాడ్మింటన్ అంటూ ఆడుకోవడానికి క్రీడాకారులకు వసతులు లభిస్తున్నాయి. ప్రస్తుతం ఖేలో ఇండియా ద్వారా మరిన్ని మెరుగైన వసతులు అందుబాటులోకి రానున్నాయి. వీటి నిమిత్తం క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ఆమె ఆదేశాల మేరకు విజయవాడ, హైదరాబాద్ నుంచి క్రీడాశాఖ ఉన్నత అధికారులు కేవీకే మైదానానికి విచ్చేశారు. ఇక్కడ ఏర్పాటు చేయనున్న వసతుల ఏర్పాటుకు స్థల సర్వే చేయడంతో పాటు మైదాన అభివృద్ధికి అవసరమైన చర్యలపై అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా నగరిలోని కేవీకే మైదానాన్ని పరిశీలించిన శాప్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.విజయసాగర్ మాట్లాడుతూ క్రికెట్‌కు రెండు నెట్ ప్రాక్టీస్ కోర్టులు, క్రికెట్ గ్రౌండ్‌కు ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు, బ్యాడ్మింటన్‌కు ఉడన్ కోర్టు, బాస్కెట్ బాల్ కోర్టు, దానికి ఫ్లడ్ లైట్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పరిశీలనకు విచ్చేసిన వారిలో సైట్ ఇంజినీర్ ఫిరోజ్, డీఎస్‌డీఓ బాలాజి, కేవీకే కోచ్ బాబు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సురేష్‌బాబు పాల్గొన్నారు.



నాడు

టీడీపీ హయాంలో పల్లె వైద్యం మంచం పట్టింది. అప్పట్లో పీహెచ్‌సీలు ఉదయం 11 గంటలకు తలుపులు తెరుచుకునేవి. ఆ తర్వాత మధ్యాహ్నం ఒంటి గంటకే తాళాలు పడేవి. డాక్టర్లు అప్పుడప్పుడూ చుట్టపుచూపుగా వచ్చి వెళ్లేవారు. సొంత వైద్యానికి సమయం కేటాయించేవారు. స్టాఫ్ నర్సులే ప్రాథమిక చికిత్స చేసి రోగులను పంపించేసేవారు. మందు బిళ్లలూ కరువే. సిబ్బంది కొరత వేధించేది. పురుడు పోసే దిక్కులేక గర్భిణుల ప్రాణాలు గాల్లో దీపంలా కొట్టుమిట్టాడేవి. రాత్రి పూట వైద్యం నామమాత్రమే.

నేడు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వైద్యరంగంపై దృష్టి సారించింది. సమస్యలు ఒక్కొక్కటీ పరిష్కరిస్తోంది. ఆస్పత్రిలో సరిపడా సిబ్బంది ఉండేలా చర్యలు చేపట్టింది. మందులు, వైద్యపరికరాలకు కొరతలేకుండా నిధులు కేటాయించింది. కొత్త భవనాలకు తోడు.. అవసరం మేరకు డాక్టర్లను నియమించింది. మాతృమరణాల కట్టడికి పెద్దపీట వేసింది. పల్లె ప్రజలకు అందుబాటులో ఉండే ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు 24 గంటలూ పనిచేసేలా ఆదేశాలు జారీ చేసింది. సిబ్బంది గైర్హాజరు కాకుండా డ్యూటీ చార్ట్‌ను పకడ్బందీగా అమలు చేస్తోంది.



ప్రాణాలు రక్షిస్తూ... వసతులకు పురుడు పోస్తూ!



చిత్తూరు జిల్లా గంగవరం మండలం పత్తికొండ పీహెచ్‌సీలో తల్లీబిడ్డతో సిబ్బంది, తిరుపతి జిల్లా పాపానాయుడు పేటలో గర్భిణీని పరిశీలిస్తున్న సిబ్బంది

చిత్తూరు రూరల్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 108 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. ఇందులో గత నెలాఖరు వరకు 41 మాత్రమే 24 గంటలు పనిచేసేవి. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సెప్టెంబర్ 1 నుంచి అన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు 24 గంటలూ పనిచేసేలా అధికారులు చర్యలు చేపట్టారు. సిబ్బంది ఎల్లవేళలా రోగులకు అందుబాటులో ఉండేలా ఆదేశాలు జారీ చేశారు. గర్భిణులు రాత్రి పూట వచ్చినా పురుడు పోసేలా సిబ్బందిని నియమించారు. అవసరమైన మందులతోపాటు అత్యాధునిక వైద్యపరికరాలు అందుబాటులోకి తీసుకొచ్చారు .

ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది ఇలా..

ఇద్దరు వైద్యులు, ముగ్గురు స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్, ఇద్దరు సూపర్ వైజర్లు (వీరు ఏఎన్‌ఎంలకు, వైద్యశాలకు మధ్య సంధానకర్తలు) ఉంటారు. ఎంఎన్‌ఓ లేదా ఎఫ్‌ఎన్‌ఓ, మేల్, ఫిమేల్ అసిస్టెంటు, జూనియర్ అసిస్టెంటు ఉంటారు. వీరందరినీ ఇప్పటికే సర్దుబాటు చేయడం ప్రారంభించారు.

విజయవంతంగా ఫ్యామిలీ ఫిజీషియన్

ఇప్పటికే ప్రభుత్వం పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహిస్తున్నారు. దీనికోసం ఒక్కో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 14 మంది సిబ్బంది ఉండేలా నియామకాలు చేపట్టారు. వైద్యుడు వైద్యశాలకు వచ్చే రోగులకు వైద్యం అందిస్తే.. మరో వైద్యుడు 104 ద్వారా గ్రామాల్లోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌కు వెళ్లి ఉదయం నుంచి ఓపీ చూడడం, ఆ తర్వాత ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారు, దీర్ఘకాలిక వ్యాధులతో మంచానికే పరిమితమైన వారి ఇళ్లకు వెళ్లి సేవలందించేలా ఆదేశాలు జారీచేశారు. విద్యార్థులు, అంగన్‌వాడీ చిన్నారులకు కూడా వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. మరో వైద్యుడు మాత్రం పీహెచ్‌సీలో వైద్య సేవలందించేలా చర్యలు చేపట్టారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు, మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8 వరకు, రాత్రి 8 నుంచి ఉదయం 8 వరకు మూడు షిఫ్ట్‌ల్లో పనిచేసేలా సర్దుబాటు చేశారు.


చిత్తూరు మండలం బీఎన్‌ఆర్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

చిత్తూరు జిల్లాలోని పీహెచ్‌సీల్లో ఓపీ, ప్రసవాలు		
నెల	ఓపీల సంఖ్య	ప్రసవాల సంఖ్య
మే	95,279	22
జూన్	1,03,993	31
జూలై	1,00,480	26
ఆగస్టు	1,01,728	70

తిరుపతి జిల్లాలోని పీహెచ్‌సీల్లో ఓపీ, ప్రసవాలు		
నెల	ఓపీల సంఖ్య	ప్రసవాల సంఖ్య
మే	155608	39
జూన్	185348	41
జూలై	154702	51
ఆగస్టు	126673	47

పీహెచ్‌సీల్లో తనిఖీ

ప్రభుత్వ ఆదేశాల మేరకు పీహెచ్‌సీలపై రెండు జిల్లాల వైద్య ఆరోగ్యశాఖ అధికారులు దృష్టిసారించారు. బుధవారం చిత్తూరు జిల్లా గుడిపాల పీహెచ్‌సీని, అలాగే తిరుపతి జిల్లాలోని పాపానాయుడుపేట, వడమాలపేట పీహెచ్‌సీలను తనిఖీ చేశారు. ప్రసవ కేసులపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు.


తిరుపతి జిల్లా పాపానాయుడు పీహెచ్‌సీలో ప్రసవించిన బిడ్డ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న డీఎంహెచ్‌ఓ శ్రీహరి


చిత్తూరు జిల్లా గుడిపాల మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో జన్మించిన బిడ్డను రాత్రి పూట పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి

24 గంటలు పనిచేయాల్సిందే

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఇకపై 24 గంటలు పనిచేస్తాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు సిబ్బంది కచ్చితంగా పనిచేయాలి. కేంద్రంలో సిబ్బంది లేరని ఫిర్యాదు వస్తే.. కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. ప్రతి పీహెచ్‌సీలోనూ ఇద్దరు వైద్యాధికారులు, ముగ్గురు స్టాఫ్ నర్సులు, తొమ్మిది మంది ఇతర సిబ్బంది ఉండేలా చర్యలు చేపడుతున్నాం. స్టాఫ్ నర్సులు షిఫ్ట్ వారీగా సేవలందిస్తారు. వారు సెలవు పెట్టినప్పుడు సమస్య లేకుండా మూడో షిఫ్ట్ కోసం సీనియర్ స్టాఫ్ నర్సును నియమించనున్నాం.

–డాక్టర్ ప్రభావతిదేవి, డీఎంహెచ్‌ఓ, చిత్తూరు

విధులకు వెళ్లాల్సిందే

పీహెచ్‌సీలు ఇకపై 24 గంటలు పనిచేస్తాయి. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సిబ్బంది విధులకు వెళ్లాల్సిందే. నిరంతరం పల్లె ప్రజలకు ప్రాథమిక వైద్యం అందించాలి. ముఖ్యంగా ప్రసవాల సంఖ్య పెంచాలి. హైరిస్క్ కేసులను మాత్రమే జిల్లా, ఏరియా ఆస్పత్రులకు పంపించాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరూ పీహెచ్‌సీలో అందుబాటులో ఉండాలి. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు ఉంటాయి. రాత్రి పూట విధిగా విధుల్లో ఉండాల్సిందే. డ్యూటీ చార్ట్‌ను పాటించాలి. మాతా శిశుమరణాలను కట్టడి చేయాలి.

–డాక్టర్ శ్రీహరి, డీఎంహెచ్‌ఓ, తిరుపతి

చిరస్మరణీయులు సుబ్రమణ్యశాస్త్రి



సాధు సుబ్రమణ్య శాస్త్రి విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, జ్యోతి ప్రజ్వలన చేస్తున్న టీటీడీ చైర్మన్

తిరుపతి కల్చరల్ : తిరుమల శ్రీవారి ఆలయంలోని శాసనాలను అనువదించి స్వామి వారి వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసిన చిరస్మరణీయులు సాధు సుబ్రమణ్యశాస్త్రి అని టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కొనియాడారు. ఆదివారం తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో సాధు సుబ్రమణ్య శాస్త్రి 42వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న భూమన మాట్లాడుతూ టీటీడీలో చిన్న స్థాయి ఉద్యోగిగా ప్రస్థానం ప్రారంభించి వెయ్యికి పైగా శాసనాలను వెలికితీసి పరిష్కరించిన గొప్ప వ్యక్తి సుబ్రమణ్యశాస్త్రి అని వెల్లడించారు. అన్నమయ్య రచించిన 32 వేల సంకీర్తనల్లో 12 వేల సంకీర్తనలు మాత్రమే అందుబాటులో ఉన్నాయన్నారు. అందులో అధిక భాగం సంకీర్తలను శాస్త్రి పరిష్కరించి సమాజానికి అందించారని వివరించారు. అలాంటి మహనీయునితో పాఠశాలలో చదివే రోజుల్లోనే పరిచయం కావడం తన అదృష్టమని తెలిపారు. శ్రీవారికి అమూల్యమైన సేవలందించిన సాధు సుబ్రమణ్య శాస్త్రి, వేటూరి ప్రభాకరశాస్త్రి, రాళ్లపల్లె అనంత కృష్ణ శర్మ విగ్రహాలు ప్రతిష్ఠించాలనే ఆలోచన శ్రీవేంకటేశ్వరస్వామివారే తనకు కల్పించారన్నారు. అలాంటి మహానుభావుల జీవితాలను విద్యార్థులు తప్పని సరిగా తెలుసుకోవాలని పిలుపు నిచ్చారు. సాధు సుబ్రమణ్యశాస్త్రి వెలికి తీసి పరిష్కరించిన శాసనాల పుస్తకాలను పిల్లలు, పెద్దలు కూడా చదవాలని కోరారు.అనంతరం ఆచార్య రామసూర్యనారాయణ మాట్లాడుతూ సుబ్రమణ్య శాస్త్రి సేవలను కొనియాడారు. కార్యక్రమానికి ముందు శ్వేత భవనం ఎదుట ఉన్న సుబ్రమణ్యశాస్త్రి విగ్రహానికి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి పుష్పాంజలి ఘటించారు.

గౌరి పెద్ది రామసుబ్బశర్మ విగ్రహావిష్కరణ

ఎస్వీ ఓరియంటల్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గౌరి పెద్ది రామసుబ్బ శర్మ విగ్రహాన్ని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీటీడీ జేఈఓ సదా భార్గవి, శాస్త్రి కుమార్తె గిరిజ, మనుమడు, జడ్జి మూర్తి, శ్వేత సంచాలకులు ప్రశాంతి, అన్నమాచార్య ప్రాజెక్ట్ సంచాలకుడు ఆకెళ్ల విభీషణ శర్మ పాల్గొన్నారు.

రామబంటూ..నీవే శరణమంటూ



పోకుమాను బరుకు కార్యక్రమంలో అశేష భక్తులు, ప్రత్యేకాలంకరణలో శ్రీవీరాంజనేయస్వామి

చౌడేపల్లె: సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాల బండ శ్రీవీరాంజనేయస్వామి ఆలయ తిరుణాళ్ల ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ పరిసరాలు భక్తసంద్రంగా మారాయి. జై హనుమాన్ నామస్మరణలు మార్మోగాయి. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అలంకరణలు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తొలుత రాజనాలబండకు సమీపంలోని కొత్తగూబలవారిపల్లె , దాసరయ్యగారిపల్లె, పెద్దూరు, ఉటూరు గ్రామాలకు చెందిన దేవరెద్దులతో గ్రామపెద్దలు మేళతాళాల నడుమ రాజనాలబండకు చేరుకొన్నారు. కొలింపల్లె గ్రామం నుంచి బోయకొండ గంగమ్మ అమ్మవారి ఉత్సవమూర్తితో కలసి ఊరేగింపుగా కోలాటలు, చెక్కభజనలు, పిల్లనగ్రోవులతో చేరుకుని సంప్రదాయకంగా బండారు పంపకం చేశారు. అక్కడి నుంచి దేవరెద్దులు, బోయకొండ అమ్మవారిని మేళతాళాల నడుమ ఊరేగింపుగా రాజనాలబండకు వేంచేపు చేశారు. మండలంనుంచే కాకుండా వివిధ గ్రామాలనుంచి వేలాది మంది భక్తులు రాజనాలబండకు చేరుకొనడంతో కిటకిటలాడింది. భక్తిశ్రద్ధలతో శ్రీవీరాంజ నేయస్వామికి పూజలు చేశారు. ఉట్లోత్సవం, పోకుమాను బరుగుట తదితర కార్యక్రమాలు కోలాహలంగా జరిగాయి. సీఐ కృష్ణారెడ్డి, ఎస్‌ఐ రవికుమార్ ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటుచేశారు. భక్తులకు అవసరమైన సదుపాయాలను తిరుణాల నిర్వాహక కమిటీ సభ్యులు, ఆర్‌బీ యూత్ సభ్యులు, తదితరులు ఏర్పాటుచేశారు. స్వామివారిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి దర్శించుకున్నారు.

జిల్లా యువజనోత్సవ పోటీలకు 13 లోపు పేర్ల నమోదు

తిరుపతి కల్చరల్ : జిల్లా స్థాయి యువజనోత్సవ పోటీలకు యువ కళాకారులు పేర్లు నమోదు చేసుకోవాలని సెట్విన్ సీఈఓ మురళీకృష్ణ తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ పోటీల్లో గెలుపొందిన వారు రాష్ట్ర స్థాయి యువజనోత్సవాలకు అర్హత సాధిస్తారని వెల్లడించారు. ఈ సందర్భంగా నిర్వహించనున్న వివిధ సాంస్కృతిక పోటీలకు 15 నుంచి 29 ఏళ్ల లోపు యువతీయువకులు అర్హులని వివరించారు. గతంలో విజేతలుగా నిలిచిన వారు ఈ పోటీలకు అనర్హులని స్పష్టం చేశారు. ఆసక్తి గలవారు ఈనెల 13వ తేదీలోపు పేరు, పుట్టిన తేదీతోపాటు పోటీలో పాల్గొనే అంశాలను వాట్సాప్, ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. లేదా తిరుపతి సెట్విన్ కార్యాలయంలో వివరాలను అందజేయాలని కోరారు. ఇతర వివరాలకు 0877–2286921, 9440573537, 7036428762 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కాణిపాకంలో అద్దాల మండపం ప్రారంభం

- శాస్త్రోక్తంగా సంప్రోక్షణ పూజలు
- అనుబంధ ఆలయాల్లో నూతన హోమగుండాలకు పూజలు


అద్దాల మండపంలో కొలువుదీరిన సిద్ధి, బుద్ధి, సమేత వినాయక స్వామి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ప్రధాన ఆలయంలో రూ.కోటి విరాళంతో నిర్మించిన అద్దాల మండపాన్ని ఆదివారం సంప్రోక్షణ పూజల అనంతరం ప్రారంభించారు. అలాగే కొత్తగా రాగి రేకులు తొడిగిన ప్రధాన ఆలయ ధ్వజస్తంభానికి, దేవస్థానం అనుబంధ శ్రీమణికంఠేశ్వర ఆలయం, శ్రీవరదరాజుల స్వామి ఆలయాలల్లో నూతనంగా ఏర్పాటు చేసిన హోమగుండాలకు సంప్రోక్షణ పూజలు చేసి ప్రారంభించారు. హైదరాబాద్‌కు చెందిన దాత ఏఎంఆర్ ఇండియా లిమిటెడ్ అధినేత మహేష్‌కుమార్‌రెడ్డి అద్దాల మండపం నిర్మాణానికి రూ.కోటి విరాళం ఇచ్చారు. అర్చక వేదపండితులు కలశ పూజలు, అద్దాల మండపంలో కొలువు తీర్చే శ్రీసిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామి విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు, హోమ పూజలు నిర్వహించారు. తదుపరి దేవదేవరులను సర్వాంగ సుందరంగా అలంకరించి అద్దాల మండపంలో కొలువుదీర్చి పూజల అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం ధ్వజస్తంభానికి సంప్రోక్షణ చేసి పూజలు చేసి, బాలాలయాన్ని తొలగించారు. నూతనంగా నిర్మించిన షోడశ గణపతి ఆలయంలో 16 అవతారాల స్వామివారి విగ్రహాలను కొలువుదీర్చి పూజలు చేశారు. ఆలయ నిర్మాణానికి నిధులను విరాళంగా అందించిన దాత కుటుంబ సభ్యులకు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు శేషవస్త్రాలు, స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందించారు. ఆలయ ఈఈ వెంటకనారాయణ, ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్‌లు కొండడపాణి, వాసు, కాంట్రాక్టర్ శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.


కాణిపాకం ఆలయంలో హోమ పూజలు చేస్తున్న అర్చకులు, వేద పండితులు

వడ్డెర సంఘం జిల్లా కార్యాలయం ప్రారంభం

చిత్తూరు రూరల్: చిత్తూరు గిరింపేట గాయత్రీ నగర్‌లో ఆదివారం వడ్డెర సంక్షేమ సంఘం చిత్తూరు జిల్లా నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా డీవీఎస్ మణిని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పులివెందుల మున్సిపల్ చైర్మన్ వల్లపు వరప్రసాద్, రాష్ట్ర అధ్యక్షుడు తన్నీరు ఆంజనేయులు నియమించారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా రెడ్డెప్ప, కోశాధికారిగా గుర్రప్ప వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చంద్రగిరి చక్రవర్తి, జిల్లా అధికార ప్రతినిధిగా మునెప్ప, యువత అధ్యక్షుడు చిరంజీవి, జిల్లా మహిళా అధ్యక్షురాలిగా కుమారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు వల్లపు కృష్ణారావు, రాష్ట్ర అధికార ప్రతినిధి, జిల్లా గౌరవ అధ్యక్షుడు మల్ల కుప్పం శేఖర్, జిల్లా డైరెక్టర్లు మొగిలేశ్వర్, మనోరన్న, పెద్దన్న పాల్గొన్నారు.


కార్యాలయ ప్రారంభోత్సవంలో వడ్డెర సంఘం కార్యవర్గం



HAPPY BIRTHDAY
Happy Birthday
Happy BIRTHDAY
Sri P.V. MITHUN REDDY Garu
Loksabha YSRCP Floor Leader & Loksabha Panel Speaker
MP, Rajampet.
నిత్యం ప్రజలతో మమేకమవుతూ... ప్రజల సేవకే తొలి ప్రాధాన్యమిస్తూ...
ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటూ... ప్రజల భవితకు భావి నిర్దేశకుడిగా అడుగులు వేస్తున్న...
శ్రీ పి.వి. మిథున్ రెడ్డి గారికి మా హార్థిక జన్మదిన శుభాకాంక్షలు.
ఆకేపాటి విక్రమ్ రెడ్డి
ఎంప్రడా మైన్స్ అండ్ మినరల్స్
రాజంపేట, రైల్వే కోడూరు, అన్నమయ్య జిల్లా.